- ఇప్పటికే ఏర్పాటవుతున్న పలు పరిశ్రమలు
- కొత్తగా ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్, ఆహారశుద్ధి, క్రీడలు, ఆటోమొబైల్, ఆర్గానిక్ క్లస్టర్లు ఏర్పాటుకు ప్రణాళికలు
- పూర్తికావొచ్చిన నాలుగు లైన్ల రోడ్ల నిర్మాణం
- పరిశ్రమల ఏర్పాటుకు భూములిచ్చిన రైతులు
- దేశ, విదేశీ కంపెనీలతో కేసీఆర్ సర్కార్ ఒప్పందాలు
- జహీరాబాద్ పారిశ్రామికాభివృద్ధికి అడుగులు
- సుమారు 2.66 మందికి ఉద్యోగాలు, ఉపాధి
- ఫలిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వ సంకల్పం

నిమ్జ్‌లో పారిశ్రామిక సందడి

జహీరాబాద్, జనవరి 8: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో రూపు దిద్దుకుంటున్న 'జాతీయ పారిశ్రామిక ఉత్పత్తి మండలి(నిమ్జ్)'లో పరిశ్రమల స్థాపన మొదలైంది. వెనుకబడిన జహీరాబాద్ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం నిమ్జ్‌కు రూపకల్పన చేసింది. ఈ రెండు మండలాల్లోని 17 గ్రామాలు, 12,635 ఎకరాల్లో నిమ్జ్‌ను నెలకొల్పడం, రూ.31 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడం, సుమారు 2.66 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు అవసరమైన భూములను రైతుల నుంచి సేకరించడమే కాకుండా పలు పరిశ్రమలకు భూములు కేటాయించింది. దీంతో అక్కడ పరిశ్రమల స్థాపనకు పలువురు దేశ విదేశీ వ్యాపారవేత్తలు ముందుకొచ్చారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన పారిశ్రామిక సమీక్షలో సైతం జహీరాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించడం విశేషం. పారిశ్రామిక అభివృద్ధికి మాస్టర్ పాలసీ రూపొందించాలని కూడా ఆధికారులను ఆదేశించారు. జహీరాబాద్‌లో కొత్తగా ఆటోమొబైల్, ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్, ఆహారశుద్ధి, క్రీడలు, ఆర్గానిక్ క్లస్టర్లు ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటితోపాటు రక్షణ, నావికా రంగానికి అవసరమైన పరికరాలను తయారు చేసే పరిశ్రమలను కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పారిశ్రామిక ఖిల్లాగా నిమ్జ్

ఒప్పందం చేసుకున్న ప్రకారం అన్ని సంస్థలూ తమ పరిశ్రమలను స్థాపించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తే, రానున్న రోజుల్లో నిమ్జ్ పారిశ్రామిక ఖిల్లాగా మారనున్నది. ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయి, స్థానికంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. భూముల ధరలు మరింతగా పెరగనున్నాయి. నిమ్జ్‌కు రాకపోకలు సాగించేందుకు ఎన్‌హెచ్-65 ఉగ్గెల్లి చౌరస్తా నుంచి నిమ్జ్ ఏర్పాటు చేస్తున్న ఎల్గోయి శివారు వరకు రూ.100 కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన నాలుగు వరుసల రోడ్డు పనులు చివరి దశకు చేరుకున్నాయి.

కేసీఆర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కొన్ని సంస్థలు

- ఎలక్ట్రిక్ వాహన సంస్థ ట్రైటాన్‌కు 150 ఎకరాలు భూమిని కేటాయించగా, రూ.2,100 కోట్ల పెట్టుబడులు పెడుతున్నది. 25 వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.
- జర్మనీకి చెందిన లైట్ ఆటో సంస్థకు 100 ఎకరాల భూమిని కేటాయించగా, ఆ సంస్థ రూ.1,500 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం చేసుకున్నది. ఇ సంస్థ వాహన విడిభాగాలు, ముడి పదార్థాల ఉత్పత్తి పరిశ్రమను నెలకొల్పనున్నది. తద్వారా ప్రత్యక్షంగా 9 వేల మందికి, పరోక్షంగా 18 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా.
- ఏరో స్పేస్ రంగానికి చెందిన వెమ్ టెక్నాలజీస్ సంస్థకు 511 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ సంస్థ రూ.1000 కోట్లు పెట్టుబడి పెడుతున్నది. ఈ పరిశ్రమ అధునాతన రక్షణ సామగ్రి, ఏరోస్పేస్, ఏరోనాటిక్స్, అంతరిక్ష రంగాల్లో ఉపయోగపడే పరికరాలను ఉత్పత్తి చేస్తుంది. ఏరో స్ట్రక్చర్స్, ఏరో ఇంజిన్స్ రాడార్, సిస్టమ్స్, హెలిక్యాప్టర్లు, విమానాలకు సంబంధించిన పరికరాలు ఉత్పత్తి చేస్తారు. ఈ పరిశ్రమలో ప్రత్యక్షంగా 2 వేల మందికి ఉద్యోగాలు, పరోక్షంగా 4 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 2022 జూన్ 22న నిమ్జ్‌లో వెమ్ టెక్నాజీస్ పరిశ్రమ ఏర్పాటుకు అప్పటి ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఇప్పటికే వెమ్ టెక్నాలజీస్ పనులు ప్రారంభించింది.

200 కోట్లు.. 12 మాడళ్లు

2024లో భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్న మెర్సిడెజ్ బెంజ్

న్యూఢిల్లీ, జనవరి 8: జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్..దేశీయ మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. 2023లో 17,408 యూనిట్ల వాహనాలను విక్రయించిన సంస్థ..ఈ ఏడాదిపై గంపెడు ఆశ పెట్టుకున్నది. దేశీయంగా లగ్జరీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది దేశీయ మార్కెట్లోకి 12 కొత్త మాడళ్లను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ నూతన వాహనాలు, డిజిటలైజేషన్, ఉత్పత్తి కోసం రూ.200 కోట్ల మేర పెట్టుబడి పెట్టబోతున్నట్లు మెర్సిడెజ్-బెంజ్ ఇండియా ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. వీటిలో మూడు ఎలక్ట్రిక్ వాహనాలతోపాటు టాప్ ఎండ్ వాహనాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. వీటి ధర రూ.1.5 కోట్ల కంటే అధికంగా ఉండనున్నాయన్నారు. దేశీయ ఆటోమొబైల్ మార్కెట్లోకి అడుగుపెట్టి 30 ఏండ్లు పూర్తైందని, ఇప్పటి వరకు రూ.3 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టినట్టు ఆయన చెప్పారు. దీంట్లో భాగంగానే ఈ ఏడాది కొత్త మాడళ్లను అభివృద్ధి చేయడానికి పుణె ప్లాంట్ రూ.200 కోట్లను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. గడిచిన మూడేండ్లుగా భారత్‌లో కంపెనీ విక్రయాలు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకుంటున్నాయని, 2022లో 15,822 యూనిట్లు, 2023లో 17,408 యూనిట్లు అమ్ముడయ్యాయని తెలిపారు. ప్రస్తుతం కంపెనీ చేతిలో 3 వేల ఆర్డర్లు ఉన్నాయని, వీటిని త్వరలో కస్టమర్లకు అందచేయనున్నట్లు ప్రకటించారు.

మార్కెట్లోకి నయా జీఎల్ఎస్ మాడల్

మార్కెట్లోకి నయా జీఎల్ఎస్ లగ్జరీ ఎస్‌యూవీని విడుదల చేసింది. పెట్రోల్, డీజిల్ వెర్షన్లలో లభించనున్న ఈ కారు రూ.1.32 కోట్లు, రూ.1.37 కోట్ల ధరలో లభించనున్నాయి. మల్టీ-జోన్ క్లైమేట్ కంట్రోల్, డ్యూయల్-డిజిటల్ డిస్‌ప్లే, వైర్‌లెస్ ఫోన్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. 3 లీటర్ డీజిల్, పెట్రోల్ ఇంజిన్‌తో రూపొందించిన ఈ కారు బీఎండబ్ల్యూ ఎక్స్7, ఆడీ క్యూ8, రేంజ్‌రోవర్ స్పోర్ట్, వోల్వో ఎక్స్‌సీ90లకు పోటీగా విడుదల చేసింది.

రాష్ట్రంలో మోల్డ్-టెక్ ప్లాంట్ ప్రారంభం

హైదరాబాద్, జనవరి 8: ప్యాకేజింగ్ రంగంలో ఉన్న మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ కొత్తగా మూడు ప్లాంట్లను ప్రారంభించింది. తెలంగాణలోని సుల్తాన్‌పూర్, హర్యానాలోని పానిపట్, తమిళనాడులోని చెయ్యార్ వద్ద రూ.100 కోట్లతో ఆరంభించింది. ఈ నూతన కేంద్రాల వార్షిక సామర్థ్యం 5,500 మెట్రిక్ టన్నులు. దీంతోపాటు మహారాష్ట్రలోని మహద్ వద్ద రూ.20 కోట్లతో కొత్తగా 1,500 మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యంతో ప్లాస్టిక్ కంటైనర్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి భూమిని కొనుగోలు చేసినట్లు మోల్డ్‌టెక్ సీఎండీ జే లక్ష్మణ రావు తెలిపారు. 2024-25లో కంపెనీ రూ.75-80 కోట్ల మూలధన వ్యయం చేయనుండటంతో వార్షిక తయారీ సామర్థ్యం 54 వేల మెట్రిక్ టన్నులకు చేరుకోనుందన్నారు. ప్రస్తుతం సంస్థ ల్యూబ్స్, పెయింట్స్, ఆహార పదార్థాల కంటైనర్లు తయారు చేస్తున్నది. వచ్చే ఐదు నుంచి ఆరేండ్లకాలంలో కంపెనీ మొత్తం వ్యాపారంలో ఫుడ్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా రంగాల వాటా 50 శాతానికి పైగా ఉంటుందని వ్యాఖ్యానించారు.

2.5 లక్షల కోట్ల నష్టం!

భారత్‌పై ఎర్ర సముద్రం ఎఫెక్ట్ • ఈ ఆర్థిక సంవత్సరం దేశీయ ఎగుమతులు 7 శాతం తగ్గవచ్చన్న అంచనాలు

న్యూఢిల్లీ, జనవరి 8: ఎర్ర సముద్రం ప్రభావం.. భారతీయ వర్తక, వాణిజ్యంపై గట్టిగానే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెడ్ సీలో సంక్షోభం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) దేశీయ ఎగుమతుల్ని గత ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోల్చితే 6.7 శాతం మేర తగ్గించవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. 2022-23లో భారత్ నుంచి 451 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. అయితే ఈ 2023-24లో 421 బిలియన్ డాలర్లకే పరిమితం కావచ్చని రిసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ డెవలపింగ్ కంట్రీస్ (ఆర్ఐఎస్) చెప్తున్నది. దీంతో 30 బిలియన్ డాలర్ల (రూ.2.50 లక్షల కోట్లు) వరకు పడిపోవచ్చని తెలుస్తున్నది. ఎర్ర సముద్రంలో సరకు రవాణా నౌకలకు హౌతీ మిలిటెంట్ల నుంచి ప్రమాదం పొంచి ఉండటంతో కంటైనర్ షిప్పింగ్ రేట్లు అమాంతం పెరిగాయి. అంతేగాక ప్రయాణ ఖర్చులు, కంటైనర్లలోని సరకులకు సంబంధించిన బీమా ప్రీమియంలూ భారంగా తయారయ్యాయి. దీంతో ఎగుమతిదారులు వెనుకడుగు వేస్తున్నట్టు ఆర్ఐఎస్ డైరెక్టర్ సచిన్ చతుర్వేది చెప్తున్నారు. ఇప్పటిక భారతీయ ఎగుమతిదారులు 25 శాతం ఎగుమతుల్ని ఆపేసినట్టు దేశీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈవో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ తెలిపారు. ఇక గత నెల ప్రథమార్థంతో పోల్చితే ఇప్పుడు ఎర్ర సముద్రం మీదుగా వెళ్లే నౌకలు దాదాపు 44 శాతం తగ్గాయని ప్రపంచంలోనే అతిపెద్ద షిప్ బ్రోకర్ క్లార్క్‌సన్ రిసెర్చ్ గుర్తుచేస్తున్నది. సరకు రవాణా సామర్థ్యం కూడా 40 లక్షల టన్నుల నుంచి 25 లక్షల టన్నులకు తగ్గిందంటున్నది.

ఎర్ర సముద్రంలో ఏం జరుగుతోంది?

ఇరాన్ అండదండలతో రెచ్చిపోతున్న హౌతి తిరుగుబాటుదారులు.. గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను వ్యతిరేకిస్తూ ఎర్ర సముద్రంలో నౌకలపై విరుచుకుపడుతున్నారు. ఆసియా, ఐరోపా దేశాల మధ్య వర్తక, వాణిజ్యానికి వీలుగా హిందూ మహాసముద్రం, మెడిటరేనియన్ సముద్రం నడుమ ఉండే వారధే ఈ ఎర్ర సముద్రం. దీనికి ఒక చివరన సూయెజ్ జలసంధి ఉంటే.. మరో చివరన బాబ్ ఎల్-మండేబ్ జలసంధి. 30 కిలోమీటర్ల వెడల్పుండే ఈ బాబ్ ఎల్-మండేబ్ జలసంధిలోనే నిరుడు నవంబర్‌లో కనీవినీ ఎరుగని రీతిలో ఓ నౌకను హౌతీ తిరుగుబాటుదారులు హైజాక్ చేశారు. ఏకంగా హెలీక్యాప్టర్ ద్వారా నౌకపై దిగి, తమ అధీనంలోకి సదరు షిప్‌ను తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ మార్గం గుండా మార్స్క్, హపాగ్-లాయిడ్ వంటి అగ్రశ్రేణి షిప్పింగ్ కంపెనీలు తమ కార్యకలాపాలను తాత్కాలికంగా ఆపేశాయి. మరికొన్ని కంటైనర్ల ధరల్ని బాగా పెంచి నడిపించే సాహసం చేస్తున్నాయి. ఈ పరిణామం యావత్తు ఆసియా-ఐరోపా ట్రేడింగ్‌ను ప్రభావితం చేస్తున్నది. ప్రపంచ వాణిజ్యంలో ఈ మార్గం గుండా జరిగే ఎగుమతి-దిగుమతుల వాటా 12 శాతంగా ఉన్నది. కాగా, నిజానికి మొదట్లో ఇజ్రాయెల్ నౌకలనే హౌతీ రెబల్స్ లక్ష్యంగా చేసుకున్నారు. కానీ ఆ తర్వాత అన్ని నౌకలపైనా క్షిపణులతో దాడులకు తెగబడుతున్నారు.

భారత్‌కు వచ్చిన నష్టమేమిటి?

హౌతి తిరుగుబాటుదారుల దుశ్చర్యతో హిందూ మహాసముద్రంలో భాగమైన అరేబియా సముద్రం ద్వారా భారత్ నుంచి ఐరోపా, అమెరికా ఈస్ట్ కోస్ట్, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా దేశాలకు జరిగే వాణిజ్యం ఇబ్బందుల్లో పడింది. మెడిటరేనియన్ సముద్ర తీరంలోని ఆయా దేశాలకు బాబ్ ఎల్-మండేబ్ జలసంధి ద్వారా ఎర్ర సముద్రం మీదుగా సూయెజ్ జలసంధి నుంచే భారతీయ ఎగుమతులు చేరుతున్నాయి. అలాంటిది బాబ్ ఎల్-మండేబ్ జలసంధిపై హౌతి తిరుగుబాటుదారుల దాడులు జరుగుతుండటంతో ఆ మార్గంలో వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో ఈ రూట్‌కు ప్రత్యామ్నాయం.. కేప్ ఆఫ్ గుడ్ హోప్ చుట్టూ తిరిగి వెళ్లడమే. ఇలా వెళ్తే 6వేల కిలోమీటర్ల దూరం పెరుగుతుంది. అదనంగా 10 రోజులు ప్రయాణించాల్సి ఉంటుంది. ఇందుకు మరో 10 లక్షల డాలర్లదాకా ఇంధన ఖర్చు అవుతుంది. ఈ క్రమంలో బీమా వ్యయం కూడా భారంగానే తయారవుతుంది. ఇక ఇదే మార్గం గుండా భారత్‌కు ముడి చమురు దిగుమతులూ జరుగుతున్నాయి. దీంతో దేశంలో ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తుందన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, భారత్‌కు వస్తున్న క్రూడాయిల్ నౌకలపై హౌతి రెబల్స్.. డ్రోన్లతో దాడులు జరిపారన్న వార్తలు వినిపిస్తున్నాయి. అయితే వీటిని భారత ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉన్నది. మరోవైపు హౌతి రెబల్స్‌ను అడ్డుకునేందుకు సౌదీ అరేబియాతో కలిసి అమెరికా సైన్యం రంగంలోకి దిగవచ్చన్న సమాచారం కూడా ఉన్నది. ఇదే జరిగితే పరిస్థితులు ఇంకే వైపు మళ్లుతాయోనన్న ఆందోళనలు వ్యాపార వర్గాల్లో ఉన్నాయి.

తాన్లా బోర్డులోకి ట్రాయ్ మాజీ చీఫ్

హైదరాబాద్, జనవరి 8: రాష్ట్రానికి చెందిన ప్రముఖ టెక్నాలజీ సంస్థ తాన్లా బోర్డు డైరెక్టర్‌గా ట్రాయ్ మాజీ చైర్మన్ ఆర్ఎస్ శర్మ నియమితులయ్యారు. దీంతో సంస్థలో మొత్తం బోర్డు డైరెక్టర్ల సంఖ్య ఏడుకి చేరుకున్నారు. 2015 నుంచి 2020 మధ్యకాలంలో టెలికం రెగ్యులేటరీ ఆథార్టీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) చైర్మన్‌గా శర్మ పనిచేశారు. ఆయన సారథ్యంలో ట్రాయ్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని, ముఖ్యంగా వినియోగదారుల హక్కులను ప్రోత్సహించడంతోపాటు నెట్ న్యూట్రాలిటీకి మరింత ప్రచారం కల్పించారు.

వాహన అమ్మకాల్లో వృద్ధి

న్యూఢిల్లీ, జనవరి 8: దేశవ్యాప్తంగా వాహన టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయి. రిటైల్ విక్రయాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో 2023లో 11 శాతం అధికమయ్యాయని డీలర్ల సంఘం ఫాడా తెలిపింది. గతేడాది దేశవ్యాప్తంగా 2,38,67,990 యూనిట్లు అమ్ముడుకాగా, అంతక్రితం ఏడాది 2,14,92,324 యూనిట్లుగా ఉన్నాయి. వీటిలో ప్యాసింజర్ వాహనాలు 38,60,268 యూనిట్లు. 2022లో అమ్ముడైన 34,89,953 యూనిట్ల ప్యాసింజర్ వాహనాల కంటే ఇది 11 శాతం అధికమని పేర్కొంది. ద్విచక్ర వాహన విక్రయాలు 1,55,88,352 యూనిట్ల నుంచి 1,70,61,112 యూనిట్లకు చేరాయి. అలాగే త్రి చక్ర వాహన రిటైల్ సేల్స్ 58 శాతం అధికమై 6,81,812 యూనిట్ల నుంచి 10,80,653 యూనిట్లకు చేరగా..కమర్షియల్ వాహన సేల్స్ 8 శాతం పెరిగి 9,94,330 యూనిట్లకు చేరుకున్నాయి.

హైదరాబాద్‌లో ఎన్‌పీసీఐ మరో భవంతి

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 8: నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) హైదరాబాద్‌లో కొత్తగా మరో భవనాన్ని నిర్మిస్తున్నది. ఇప్పటికే ఐటీ కారిడార్‌లో సుమారు రూ.500 కోట్ల పెట్టుబడితో స్మార్ట్ డాటా సెంటర్‌ను నిర్మిస్తున్న సంస్థ..దీనికి దగ్గర్లోనే మరో భవనం నిర్మాణాన్ని చేపట్టింది. 16 అంతస్తులతో నిర్మించబోయే భవంతికి అన్ని రకాల అనుమతులు కూడా లభించినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో డాటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి ఎన్‌పీసీఐ ముందుకొచ్చింది. గతేడాది డాటా సెంటర్ కోసం ఐటీ కారిడార్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లో కేసీఆర్ ప్రభుత్వం 3.5 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అందులో ఇప్పటికే నాలుగు అంతస్తుల్లో కార్యకలాపాలు ప్రారంభించగా..తాజాగా దీనికి అనుకొని మరో 16 అంతస్తుల భవనాన్ని నిర్మించబోతున్నది. పెరుగుతున్న డిజిటల్ కార్యకలాపాలు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని 3,938 చదరపు మీటర్ల స్థలంలో 16 అంతస్థుల భవనాన్ని నిర్మించేందుకు పర్యావరణ అనుమతులను కూడా లభించాయి.

అసమానతలు తగ్గాయి

ఆదాయాలపై ఎస్బీఐ రిసెర్చ్ నివేదిక

న్యూఢిల్లీ, జనవరి 8: దేశంలో ఆదాయ అసమానతలు తగ్గాయని, ముఖ్యంగా పన్నులు చెల్లించేవారిలో మూడోవంతు అధిక ఆదాయ పన్ను పరిధిలోకి చేరారని ఎస్బీఐ పరిశోధన నివేదికలో వెల్లడించింది. అయినప్పటికీ పన్ను చెల్లించేవారి సంఖ్య తగ్గిపోవడం విశేషమని తన ఎకనమిక్ రీసర్చ్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన నివేదికలో తెలిపింది. కరోనాతో కుదులైన దేశ ఆర్థిక వ్యవస్థ మళ్లీ వృద్ధి బాట పట్టింది. 2014 నుంచి 2022 ఆర్థిక సంవత్సరాల మధ్యకాలంలో పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం 0.472 శాతం నుంచి 402 శాతానికి తగ్గినట్టు పేర్కొంది. ఇదే సమయంలో 36.3 శాతం మంది పన్ను చెల్లించేవారు తక్కువ ఆదాయం నుంచి అధిక ఆదాయ పనున బకెట్‌లోకి చేరారు. వారి ఆదాయం 21.3 శాతం అధికమైంది. విలువ పరంగా చూస్తు చిన్న స్థాయి సంస్థలు ఎంఎస్ ఎంఈలుగా మారాయి.

- 2013-14 నుంచి 2021-22 మధ్యకాలంలో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల లోపు వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లించేవారు 295 శాతం చొప్పున పెరిగారు.
- రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల లోపు ఐటీఆర్ దాఖలు చేసేవారు 291 శాతం అధికమయ్యారు.
- ఐటీ రిటర్నులు దాఖలు చేసేవారి సంఖ్య 7 కోట్ల నుంచి 7.4 కోట్లకు చేరుకున్నారు. గతేడాది డిసెంబర్ చివరినాటికి 8.2 కోట్లకు చేరారు.

బేర్‌మన్న స్టాక్ మార్కెట్లు

- 72వేల దిగువకు సెన్సెక్స్
- 671 పాయింట్లు పతనం
- 198 పాయింట్లు పడిన నిఫ్టీ

ముంబై, జనవరి 8: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ ఏడాదిలోనే భారీ పతనాన్ని చవిచూశాయి. సోమవారం అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ పెద్ద ఎత్తున నష్టపోయాయి. నిజానికి ఉదయం ఆరంభంలో లాభాల్లోనే నడిచినా.. ఆ తర్వాత మాత్రం నేలచూపులు చూశాయి. సమయం గడుస్తున్నకొద్దీ మరింత దిగజారాయి. ఈ క్రమంలోనే వరుస రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 670.93 పాయింట్లు లేదా 0.93 శాతం క్షీణించి 71,355.22 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 725.11 పాయింట్లు కోల్పోవడం గమనార్హం. నిఫ్టీ సైతం 197.80 పాయింట్లు లేదా 0.91 శాతం పడిపోయి 21,513 వద్ద ముగిసింది.

ఎఫ్ఎంసీజీ షేర్లు ఢమాల్

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందుకున్న బలహీన సంకేతాలతో లాభాల స్వీకరణ దిశగా నడిచిన మదుపరులు.. పలు కీలక రంగాల షేర్లను అమ్మేశారు. ఎఫ్ఎంసీజీ షేర్లు అత్యధికంగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా ఈ సూచీ 1.55 శాతం పడిపోయింది. ఆ తర్వాత కమోడిటీస్ 1.44 శాతం, బ్యాంకింగ్ 1.42 శాతం, మెటల్ 1.40 శాతం, ఆర్థిక సేవలు 1.05 శాతం, టెలీకమ్యూనికేషన్ 0.93 శాతం, ఐటీ 0.90 శాతం, టెక్నాలజీ 0.77 శాతం చొప్పున నష్టపోయాయి. దీంతో పవర్, రియల్టీ, సర్వీసెస్ రంగాల షేర్లు లాభపడినా.. సూచీలను నిలబెట్టలేకపోయాయి. ఇక షేర్లవారీగా చూస్తే.. ఎస్బీఐ, ఐటీసీ, నెస్లే, ఏషియన్ పెయింట్స్, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టపోయాయి. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, పవర్ గ్రిడ్, సన్ ఫార్మా, ఎన్టీపీసీ, బజాజ్ ఫైనాన్స్, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.87 శాతం, స్మాల్‌క్యాప్ 0.36 శాతం క్షీణించాయి.

నష్టాలకు కారణాలు

- అమెరికా బాండ్ ఈల్డ్స్ ఆకర్షణీయం
- ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతలు ఆలస్యమవుతాయన్న అంచనాలు
- అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల నష్టాలు
- ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి
- లాభాల స్వీకరణ దిశగా నడిచిన మదుపరులు

2.91 లక్షల కోట్లు ఆవిరి

సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లకు వాటిల్లిన నష్టాలు.. మదుపరుల సంపదను భారీగానే ఆవిరి చేశాయి. బీఎస్ఈలో నమోదైన సంస్థల మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.2,91,756.23 కోట్లు తగ్గింది. దీంతో మొత్తం మార్కెట్ క్యాప్ రూ.3,66,40,965.08 కోట్లకు పరిమితమైంది. అమెరికా బాండ్ ఈల్డ్స్ మళ్లీ 4 శాతాన్ని దాటడం.. భారతీయ ఈక్విటీ మార్కెట్లను బాగా ప్రభావితం చేసింది. ఇన్వెస్టర్లు ఒక్కసారిగా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. అలాగే ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతలకున్న అవకాశాలూ తగ్గడం.. మార్కెట్ సెంటిమెంట్‌ను ఇంకా బలహీనపర్చిందని అంటున్నారు.

గ్లోబల్ మార్కెట్లలో..

ఆసియా, ఐరోపా మార్కెట్లూ నష్టాల్లోనే కదలాడాయి. ఆసియాలో ప్రధానమైన దక్షిణ కొరియా, చైనా, హాంకాంగ్ సూచీలు పడిపోగా, ఐరోపాలోని బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ సూచీలూ దిగజారాయి. అమెరికా మార్కెట్లు మాత్రం శుక్రవారం స్వల్పంగా పెరిగినది తెలిసిందే. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐలు) శుక్రవారం రూ.1,696.86 కోట్ల విలువైన షేర్లను కొన్నారు.

వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు రెట్టింపు

2030నాటికి 100 బిలియన్ డాలర్లకు

గ్రేటర్ నోయిడా, జనవరి 8: దేశం వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు రెట్టింపు అవుతాయని అంచనా వేస్తున్నట్టు కేంద్ర వాణిజ్య కార్యదర్శి సునీల్ భర్తావాల్ చెప్పారు. ప్రస్తుతం 50 బిలియన్ డాలర్లుగా ఉన్న వ్యవసాయ ఎగుమతులు 2030వ సంవత్సరానికల్లా 100 బిలియన్ డాలర్లకు పెరుగుతాయని భావిస్తున్నామన్నారు. సోమవారం నాడిక్కడ ఇండస్‌ఫుడ్ షో 2024 కార్యక్రమంలో భర్తావాల్ మాట్లాడుతూ రెడీ-టూ-ఈట్ ఫుడ్ తదితర విభాగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని, దిగుమతి దేశాల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక ప్రమాణాల్ని పెంచుకోవడంపై దృష్టి నిలపాలని పరిశ్రమకు సూచించారు. ఈ షోను వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ ప్రారంభిస్తూ బియ్యం, గోధుమ, చక్కెర తదితర ఎగుమతులపై నియంత్రణలు విధించినప్పటికీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వ్యవసాయ ఎగుమతులు గత ఏడాది స్థాయిలోనే 53 బిలియన్ డాలర్లకు చేరతాయని చెప్పారు. కొన్ని ఎగుమతులను నియంత్రించడంతో 4-5 బిలియన్ డాలర్ల మేర ప్రభావం పడుతుందని అంచనా వేస్తున్నట్టు కొద్ది రోజుల క్రితమే వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారి పేర్కొన్న సంగతి తెలిసిందే.

జీ-సోనీల విలీనం రద్దు?

న్యూఢిల్లీ, జనవరి 8: జీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ప్రతిపాదిత విలీనాన్ని సోనీ ఇండియా రద్దుపర్చుకోవచ్చని వార్తలు వెలువడుతున్నాయి. ఇరు సంస్థలను విలీనం చేసి 10 బిలియన్ డాలర్ల విలువగల మెగా ఎంటర్‌టైన్‌మెంట్ కంపెనీగా రూపొందించాలన్న ప్రతిపాదన నుంచి విరమించుకోవాలని సోనీ యోచిస్తున్నదని, ఈ మేరకు జనవరి 20న టెర్మినేషన్ నోటీసు జారీచేయవచ్చని బ్లూంబర్గ్ వార్తా సంస్థ వెల్లడించింది. అయితే విలీన కంపెనీకి జీ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రమోటర్ పునీత్ గోయింకా సారథ్యం వహించడంపై సోనీ ఆలోచనలు ప్రస్తుతం మారిపోయాయని, ఈ నేపథ్యంలో ఒప్పందం రద్దుకు మొగ్గు చూపుతున్నట్టు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. విలీన కంపె